# లోక విద్యా ప్రపంచం

పక్షపత్రిక

సంపుటి-1, సంచిక-4   16- ఏప్రిల్ - 2013   సంపాదకుడు & ప్రచురణ కర్త : టి. నారాయణ రావు   వెల. రూ. 2

## ప్రజాస్వామ్యంలో ఎన్నికలు

మళ్లీ ఎన్నికలొస్తున్నాయి. దేశప్రజలందరూ లోకవిద్యా ధరులతో సహా ఓట్లేస్తారు. ఓటువేసేటప్పుడు మాగ్రామానికి ఇన్ని రోజులు సరైయిన మంచినీళ్ళివ్వక పోయినా, రోడ్లు వెయ్యలేక పోయినా, బస్సు రవాణా సౌకర్యం కల్పించకపోయినా, అందరికి రేషన్‌కార్డులు ఇవ్వలేక పోయినా, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వలేకపోయినా, పండిన పంటకు గిట్టుబాటుధర ఇవ్వలేక పోయినా, చదువుకుందామనుకున్న వారందరికి విద్య అందుబాటులో లేకపోయినా అందరికి 'గుర్తింపు' కార్డులు లేకపోయినా మాప్రాంతానికి చెందాల్సిన వెనుకబడ్డ షెడ్యూల్ కులాల, తెగల కోటా నిధులు వేరే పథకాలకి మళ్ళించినా, అన్యాయంగా అనేకమందిని జైళ్ళలో పెట్టినా, న్యాయస్థానం తీర్పులు వెన్వెంటనే రాకపోయినా, మాప్రాంత అధికారులు స్థానికావసరాలను మరచి దేశ భవిష్యత్‌కోసం మాప్రాంతాన్ని పెద్ద రిజర్వాయర్‌లో ముంచేసినా, ఊళ్ళను ఖాళీ చేయించి గనులు తవ్వించినా పట్టణ ప్రాంతపు చెత్తను మా గ్రామ సరిహద్దులోవేసినా, మాగ్రామాలకు చెందిన చిన్ననీటి వనరులను నిర్లక్ష్యంచేసినా, మేం పండించిన పంటలను, కూరగాయలను అతిచౌకగా అమ్ముకోవల్సిన పరిస్థితి కల్పించినా చేతివృత్తుల ద్వారా ఉత్పత్తియిన వస్తువుల స్థానే పెద్ద ఎత్తున పారిశ్రామిక ఉత్పత్తులతో మార్కెట్లు నింపేసినా పెద్ద పెద్ద పరిశ్రమలు గనులకోసం భూములు ఖాళీ చేయించినా, ఒక్కమాటలో చెప్పాలంటే మన గ్రామీణ ప్రాంతపు ప్రతీ ఒక్కరి జీవనాన్ని దుర్భరం చేసి స్థానిక పునర్నిర్మాణానికి ఏరోజూ కృషి చెయ్యని పార్టీలు నిలబెట్టిన అభ్యర్థులకి ఇష్టమున్నా లేకపోయినా ఓట్లు వెయ్యాలి.

చిన్న పరిశ్రమలు, కుటీర పరిశ్రమలు, చేతివృత్తులు, స్థానిక సంతలు దేశీయ వైద్యం మొదలైన విషయాలను మాట్లాడేవారికి ఈ ఎన్నికలప్పుడు మాట్లాడే అవకాశమే లేదు. కారణం డబ్బు. అంటే స్థూలంగా ఈ ఎన్నికలు డబ్బు ద్వారా డబ్బున్న వాళ్ల కోసం, మరింత డబ్బులు సంపాదించుకోవడం కోసం పడే పోటీలో ఎవరు ఎక్కువ పాటదారో వారికి ఓట్లు వేసే ప్రక్రియ. ఆఫ్ బాటిల్, రూ. 500 నుంచి ఫుల్‌బాటిల్, రూ. 1000/- దాకా ఖర్చు పెట్టినవాళ్ళు పెట్టుబడి వడ్డీతో సహా నాలుగు బొగ్గు గనులో, రెండు గ్యాస్ బావులో, నాలుగు ఫ్యాక్టరీలో, 10 కాంట్రాక్టులో, మరే ఇతరమైన పద్ధతిలోనో సంపాదించుకోవడానికి 5 ఏళ్ళకాలం వెచ్చించుకోవడం; చిన్న మోటార్ సైకిల్నుంచి, ఇన్నోవా, స్కార్పియో, క్వాలీస్ కార్లలో పెరగడాన్ని, తిరగడాన్ని కోరుకునే యువత.

మా కులానికి చెందిన నాయకులందరిని ఎన్నుకోవడానికి మా ప్రాంతీయ పార్టీ అధికారం కోసం ఎన్నుకోవడానికి మేము ధన ప్రాణ, మానాలను అర్పించడానికి సిద్ధంగా వున్నామనే మేధావి వర్గం.

మన రాష్ట్రంలో ఏ కార్యాలయానికి వెళ్లినా, సిటిజన్ చార్టర్, సమాచార హక్కు చట్టం, అధికారుల పేర్లు కనబడతాయి. ఏ కార్యాలయానికి వెళ్ళినా ఏవిధంగా ఆ కార్యాలయం నుంచి బయటకు పంపేయాలా అని అత్యున్నత అధికారి నుంచి బంట్రోతు వరకు ఎదురు చూస్తుంటారు. ఎన్నిక కాబడిన ప్రతినిధులు చట్టాలు చేయడం మాని, చేసిన చట్టాలను అమలు చేయడానికి - అనేకన్నా మా అర్జీదారుడొక్కడికి సహాయం చెయ్యండి. మీ ఋణం వుంచుకోం. అని చెప్పే ప్రజాప్రతినిధులకు లెక్కే లేదు.

ఇక ఎన్నికల నియోజక వర్గాలకొస్తే ఆ నియోజక వర్గ ప్రజలనందరిని కలవడానికి ఒకపార్లమెంటు సభ్యుడు 10 జన్మలెత్తాలి. సరాసరిన 120 కోట్ల భారతీయులకు 543 లోకసభ సభ్యులంటే ప్రతీ 24 లక్షల మందికి ఒక సభ్యుడన్నమాట. దీంతో ప్రజాప్రతినిధికి ఓటర్లకు మధ్య సంబంధం అక్కర్లేదని ఇట్టే అర్థమౌతుంది. అందుకే పంజాబులో పుట్టిన మన్‌మోహన్‌సింగ్ అస్సాం నుండి, కాశ్మీర్‌లో పుట్టిన గులాంనబీఅజాద్ హైద్రాబాద్ నుండి, నెల్లూరులో పుట్టిన వెంకయ్య నాయుడు బెంగుళూర్ నుండి అంతా ఢిల్లీ అదుపాజ్ఞలలో ఎన్నికలు నిర్ణయమైపోతాయి. చివరికి చీఫ్ మినిస్టర్ పేరు కూడా స్థానిక శాసన సభ్యుల బదులు ఢిల్లీ నుండి సీల్ట్ కవరులో కానీ, వారిప్రతినిధి సమక్షంలో వారి కనుసన్నలలో జరగడం పరిపాటి.

అందరి పార్లమెంటు సభ్యుల ఓటు విలువ సమానమే. కానీ 31 లక్షల ఓటర్లతో ఎన్నిక కాబడిన ఔటర్ ఢిల్లీ, 29 లక్షలతో ఎన్నిక కాబడిన థానే, తూర్పుఢిల్లీ, కనకపురా నుంచి 25 లక్షలతో ఎన్నిక కాబడిన వారు. 38 వేల ఓట్లతో ఎంపిగా ఎన్నికయిన లక్షదీప్, 72 వేల ఓట్లతో ఎన్నికయిన డామన్ డయ్యూ సభ్యుడు, 98 వేల ఓట్లతో ఎన్నికయిన దాద్రానగర్ హవేలి, 1,40,000 ఓట్లతో లడఖ్, 2,48,000 ఓట్లతో ఎన్నికయిన అండమాన్ నికోబార్‌దీవుల సభ్యులంతా సమానులే. 10 చ.కి.మీ చాందిని చౌక్ ఎంపిక, 13 కి.మీ. కలకత్తా వాయువ్య, దక్షిణ బొంబాయి సభ్యులకి, 18 కి.మీ. దక్షిణ మధ్య బొంబాయి సభ్యుడికి, లక్ష 73 వేల కి.మీ. లడక్ సభ్యుడికి, బర్మేర్ 71 వేల 600 కి.మీ. సభ్యుడికి సమాన హక్కులే. వారందరికీ ఇచ్చే జీతభత్యాలు, నియోజక వర్గ నిధులు సమానమే. ఇదీ సమానత్వం అంటే!

ఇక 133 లోకసభ స్థానాలు ఎస్.సి., ఎస్.టి. లకు కేటాయింపబడ్డాయి. అక్కడుండే ఇతర వర్గాల వారికీ మిగతా 410 సీట్లలో ఎస్.సి., ఎస్.టి. వర్గాలవారికీ ఈ ఎన్నికల్లో ఓటర్ల హోదా మాత్రమే. ఎన్నికయ్యే అవకాశం ఎప్పుడు? రాయబరేలీ, అమేథిలోని ఎస్.సి., ఎస్.టీలకు లోకసభకు వెళ్ళే అవకాశం ఎప్పుడు? ఇవన్నీ ఈ ప్రజాస్వామ్య ఎన్నికలలో సమాధానాల్లేని ప్రశ్నలు.

స్థానిక పంచాయితీ బోర్డు మెంబర్‌గా కానీ, సర్పంచ్‌గా కాని, వరుసగా 4సార్లు ఎన్నికయినవాళ్ళు ఈ దేశంలో వేళ్ళ మీద లెక్కపెట్టొచ్చు. కానీ కొన్ని నియోజక వర్గాల్లో మొదటి లోక్‌సభ నుంచి ఇప్పటిదాకా అప్రతిహతంగా కొన్ని కుటుంబాల వారు అవలీలగా గెలుస్తున్నారు. దీనికి కారణాలేమిటి?

కార్మిక సంఘాల్లో ఎన్నటికీ కార్మికులతో సంబంధాలుండే వ్యక్తులు ప్రత్యక్ష ఎన్నికలలో ఎప్పుడూ గెలవడం ఎందుకు జరుగుతుంది? మన కాలనీల్లో అంటే పట్టణ ప్రాంతాలతో ఏర్పడిన నూతన గృహ సముదాయాలలో పౌర సంక్షేమ సంఘ ఎన్నికలలో సాధారణంగా పార్టీ రహితంగా ఎన్నికలు ఎందుకు జరుగుతాయి?

దేశ వ్యాప్తంగా పార్టీ రహితంగా ఎన్నికలు ఎందుకు జరగవు? మనదేశంలో జనాభా లెక్కలలోని వయోజనుల సంఖ్యకు, ఓటర్ లిస్టుకు తేడా లెందుకొస్తాయి? జనాభా లెక్కల కుటుంబాల సంఖ్యకు, రేషన్‌కార్డుల సంఖ్యకు తేడా లెందుకొస్తాయి? రేపు ఆధార్ వారి సంఖ్యకు, జనాభా లెక్కల వారి సంఖ్యకు తేడా లేకుండా వుంటుందా? కొన్ని గ్రామాలకు గ్రామాలే పూర్తిగా తెల్లకార్డులతో ఎలా వున్నాయి? తెల్లకార్డుల వారికి లక్షల డిపాజిట్లు కట్టి కంట్రాక్టులు, బ్రాందీషాపులు తనఖా పెట్టి లోన్లు తీసుకోవడం ఎలా సాధ్యం? ఈ ప్రశ్నలన్నీ సమాధానాలకోసం వేసినవి మాత్రం కాదు. ప్రస్తుత ఎన్నిక విధానంలో ఎన్నికయిన వారు ప్రజలతో సంబంధాలు లేకుండా వ్యక్తిగత లాభాలకోసం దేశభవిష్యత్ పేరుతో, అభివృద్ధి పేరుతో, సైన్సు పేరుతో లోకవిద్యాధరుల సమాజాన్ని అతలాకుతలం చేసే ఈ ఎన్నికల్లో స్థానికంగా రైతులకు, వృత్తి విద్యాధరులకు, కుటీర పరిశ్రమల అభివృద్ధి కొరకు, భూసేకరణకు వ్యతిరేకంగా స్థానిక చిన్న వ్యాపారులు, తోపుడు బండ్ల వారికి, నిరుద్యోగులకు ఎస్.సి., గిరిజన తెగలకు ఏదైనా ప్రత్యక్ష, పరోక్ష సహాయాలు చేయడంతోపాటు ఉద్యమాల్లో ముందుండి చట్టంముందు అందర్ని తనతోసహా సమానంగా చూడగల్గిన వారిని గుర్తించాల్సిన అవసరం ఎంతైనా వుంది. ఇటువంటి సమాజ స్థాపనకోసం ఉద్యమాల ద్వారా లోక విద్యాధరులందరూ ఐక్య సంఘటన నిర్మించడమే ఈ ఎన్నికల్లో మన ముందున్న లక్ష్యం. అభ్యర్థుల నిర్ణయాలు స్థానికంగా జరగాలి. ఢిల్లీలోనో, హైదరాబాద్‌లోనో కాదు. హైకమాండ్‌ల వల్ల అంతకన్నా కాదు. అటువంటి అభ్యర్థుల గెలుపుకు విరాళాలు పెద్ద పరిశ్రమలవాళ్ళు, సూపర్ మార్కెట్ వాళ్ళు, కంట్రాక్టర్లు ఇచ్చారంటే ఆ అభ్యర్థి వారికోసం మాత్రమే పనిచేస్తాడని ఎన్నికల తర్వాత ప్రజలతో వుండలేడనే సత్యాన్ని గుర్తించాలి.

కులంకోసం, నోట్లకోసం, సీసాకోసం, ఓట్లు వేసే సంస్కృతిలో సమాజ శ్రేయస్సు ఏమాత్రం లేదు. - నారాయణరావు

## విద్యుత్ సంక్షోభం - ప్రత్యామ్నాయం

రాష్ట్రంలో 1991 తరువాత ప్రవేశపెట్టిన సంస్కరణలు ప్రభుత్వరంగంలో అన్ని విభాగాలు ప్రయివేటీకరణ వైపు మార్పు తీసుకున్నాయి. కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలు తాము అధికారంలో వున్న కాలంలో ప్రయివేట్ రంగంలో విద్యుత్ పరిశ్రమలను ప్రోత్సహించడం చేసాయి.

ప్రస్తుత సంక్షోభం తలెత్తడానికి పాలకులు అమలుచేసిన సంస్కరణలు ఫలితంగా తలెత్తినవే. ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 16020 మె.వా కాగా ఈ సం॥ 13200 మె.వా. మాత్రమే వివిధ వనరుల ద్వారా ఉత్పత్తి అయింది. 3000 మె.వా. కొరత ఉంది. గత 3 సం॥రాలుగా వర్షాలు సరిగాపడకపోవడంతో 3189 మి.యూనిట్లు జలవిద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంలో 1016 మి.యూనిట్లకు తగ్గడం జరిగింది.

ఆంధ్రప్రదేశ్ తీరప్రాంతంలో సహజ వాయువు వుందని కనుగొన్నా, కేంద్రప్రభుత్వ ఆధ్వర్యంలోని ఓ.ఎన్.జి.సిని పక్కకు తప్పించి రిలయన్స్ సంస్థకు లైసెన్స్ ఇచ్చారు. ఏ ప్రాంతంలోనయినా సహజ వనరులు వెలికితీస్తే ఆప్రాంత అవసరాలు వినియోగించిన తరువాత ఇతర ప్రాంతాలకు తరలించాలి. కానీ సమస్త అధికారాలు తన చేతిలో పెట్టుకున్న కేంద్ర ప్రభుత్వం కె.జి.బేసిన్‌లో 8100 చ.మీ. తీరప్రాంతం బ్లాక్-డి-6లో 90 శాతం ప్రాంతం రిలయన్స్‌కు, 10శాతం నైకో రిసోర్సెస్ లిమిటెడ్‌కు లైసెన్సు ఇచ్చారు. 2010లో 60 మి. క్యూ.మీ, 2012లో 80 మి.క్యూ.మి. 2016లో 140 మీ.క్యూ.మీ. గ్యాస్ వెలికితీస్తామని ఒప్పందం చేసుకుంది. 3 సం॥లు లోపే ఉత్పత్తి ఖర్చులు పెరిగాయని, మూలధన ఖర్చులు 250 కోట్లు కాకుండా 850 కోట్లకు పెంచివేసారు. మూలధన ఖర్చులను, గ్యాస్ ధరను పెంచడం కోసం గ్యాస్ తవ్వకాన్ని నిలిపివేసి కృత్రిమ సంక్షోభం రిలయన్స్ సృష్టించింది. అంతేగాక రాష్ట్రంలోని విద్యుత్ ప్రాజెక్టులకు గ్యాస్ ఇవ్వకుండా మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలలో విద్యుత్ ప్రాజెక్టులకు గ్యాస్ సరఫరా చేసారు. గ్యాస్ ధరను 4.2 డాలర్ల నుండి 14.2 డాలర్లకు పెంచడానికి నిరాకరించిన కేంద్రమంత్రి జైపాల్‌రెడ్డిని పెట్రోలియ శాఖ నుండి రిలయన్స్ వత్తిడి వల్లనే తప్పించడం జరిగిందనేది పార్లమెంటు సభ్యులే ఆరోపించారు.

ఆంధ్రప్రదేశ్‌లో ప్రయివేట్‌రంగంలో గ్యాస్ ఆధారిత విద్యుత్ ప్రాజెక్టులు వేమగిరి, కోనసీమ, జి.వి.కె., గౌతమి గ్యాస్ సరఫరాకు గైల్‌తో ఒప్పందం చేసుకుని ప్రారంభించారు. గ్యాస్ సరఫరాను గైల్ నిలిపివేసింది. దీనిపై ఈ కంపెనీలు కోర్టుకు ఎక్కితే ఉత్పత్తిలో 20శాతం బయట అమ్ముకోవచ్చని రోశయ్య ముఖ్యమంత్రిగా వున్న కాలంలో జీ.వో 135 ఇచ్చారు. దీనివలన ప్రజలపై 1400 కోట్ల రూ॥ల భారం పడింది.

ప్రభుత్వరంగం కన్నా ప్రయివేట్‌రంగం పై పాలకులకు ప్రేమ ఎక్కువ అవడంతో రంగారెడ్డి జిల్లా శంకరపల్లి, కరీంనగర్ నేదునూర్ విద్యుత్ ప్రాజెక్టులకు గ్యాస్ సరఫరా చేయమని 2007 నుండి జెన్‌కొ కోరుతున్నా ప్రక్కనపెట్టి ఆ తరువాత కోరిన లాంకో, జి.ఎమ్.ఆర్. ప్రయివేట్ విద్యుత్ ప్రాజెక్టులకు సబ్సిడిపై గ్యాస్ సరఫరా చేసేందుకు అనుమతించారు.

ప్రయివేట్ విద్యుత్ కంపెనీల నుండి యూనిట్ రూ. 2.80లకు కొంటూ, లాంకో, జి.ఎమ్. ఆర్‌ల నుండి మాత్రం రూ. 5.70 చొ॥న యూనిట్ విద్యుత్ కొనుగోలు చేసారు. దీనివలన ఈ రెండు కంపెనీలకు రూ. 3215 కోట్లు ప్రజల సొమ్మును పాలకులే దోచిపెట్టారు. సబ్సిడీ పై గ్యాస్ కేటాయించిన ప్రయివేట్ కంపెనీలకు అధిక ధర చెల్లించడంపై కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ తప్పుపట్టింది.

# లోకవిద్య - నేటి సర్టిఫికేట్ల విద్య

ఈనాటి సమాజంలో చదువుకున్న వాళ్ళంటే ఏదో ఒక క్లాసో, డిగ్రీయో ఒక డిప్లమోనో సర్టిఫికెట్ ద్వారా సంపాదించాడనే అర్థం. నేటి విద్యాధికార చట్టం కూడా ఏదో ఒక స్కూల్ నుంచి సర్టిఫికెట్ సంపాదించే హక్కని చెప్తోంది. ఇదంతా ఎందుకంటే చదువుతున్న వాళ్ళంతా నాగరీకులు సంస్కారవంతులు, జ్ఞానవంతులు, నీతి వంతులులాగానూ చదువురాని వాళ్ళంతా నాగరికతలేని, ఏ పద్ధతీ లేని, శుచి శుభ్రతలేని, గౌరవమర్యాదలు లేని, హేయంగా, దీనంగా జీవించేవారని పోయిన నూట ఏభై సంవత్సరాల ఆంగ్ల చదువులు మనకు నూరి పోశాయి.

ఈ విద్యావిధానంలో చదువుకున్నవాళ్ళే ఇతరులందర్నీ చిన్న చూపు చూడటాన్కి, కారణం, ఈ విద్యావిధానం యొక్క శక్తి యుక్తులే. ఈ విద్యావిధానాన్ని ప్రవేశపెట్టే నాటికి భారతీయులందర్కీ స్థానిక భాషల్లో అంటే తెలుగు, తమిళం, మళయాళం, హిందీ, ఉర్దూ, అరబిక్, సంస్కృతాలలో చదువులు నేర్పే పాఠశాలలు, నలందా, తక్షశిల, నందికొండ, కంచీపురం నుంచి కొన్ని లక్షల గురుకులాల దాకా అనేక ప్రాంతాలలో స్థానిక పాలకుల ఆర్థిక సాయంతో చదువులు చెప్పే వారనే విషయాన్ని మర్చిపోయాం. దీన్ని గురించి "అందమైన వృక్షం - దేశీయ విద్యావిధానం - 18వ శతాబ్దం వరకు" అనే పుస్తకంలో ఆచార్యధర్మపాల్ విశదీకరించారు.

19వ శతాబ్ది మధ్యకాలంలో విదేశాల నుంచి వ్యాపారం కోసం వచ్చిన వివిధ దేశాలవారు వారి లెక్కా పత్రాలు చూడటాన్కి తర్వాత వారాక్రమించిన ప్రాంత పరిపాలన కోసం, వారి ప్రభుత్వ నిర్వహణ కోసం సుదూరం నుంచి వారి దేశాల నుంచి గుమాస్తాలను దిగుమతి చేయటం కన్నా స్థానికుల లోంచి ఎన్నికచేసి వారితో పనులు చేయించుకోవటం చౌకని అర్థమయ్యింది. ఆ సందర్భంలో ఇక్కడి చదువుల గురించి విచారించటానికి ఆంగ్లప్రభుత్వం "మెకాలే ప్రభువు" ను నియమించింది. నాటి సంస్కృతం, అరబిక్ నేర్పే పాఠశాలలు, మద్రసాలకు నాటి ప్రభుత్వాలు ఇస్తున్న ఆర్థిక సహాయం ఖర్చుల్ని, వివరంగా తనఖీ చేసి వాటికిచ్చే నిధుల్ని అలానే ఉంచాలా, తగ్గించాలా లేక పెంచాలా అనే విషయాలపై నివేదికిమ్మని నియమించిన ఈ "మెకాలేప్రభువు" వెంటనే ఈ విద్యాలయాలన్నింటికీ ఇచ్చే నిధులు ఆపేసి ఆంగ్లం బోధించే పాఠశాలల్ని స్థాపించాల్సిన అవసరం ఉందని నివేదిక ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా రెండు ప్రధానమైన విషయాలను ఆ నివేదికలో పొందుపరచడం జరిగింది.

1. ఆనాటి వరకు సంస్కృతం, అరబిక్‌లో నున్నటువంటి జ్ఞానం, సంవాదనలు, వివిధ విషయాలపై చర్చలు, గ్రంథస్తమైన వాటిని చదవడం కానీ కనీసం ఆ జ్ఞానాన్ని భద్రపరచడం కోసం ఒక పైసా విదిలించకూడదనే నిర్ణయం జరిగింది. మెకాలేప్రభువు భారతీయ అరబీ భాషలలో వున్న జ్ఞాన సంపదంతా కలిపి బ్రిటిష్ వారి ముందు గదిలో చిన్న పుస్తకాల అల్మారాతో సమానం కాదని అంతేగాకుండా వీటిల్లో వున్న జ్ఞానంలో సాహిత్య విలువలు కానీ, శాస్త్రీయ విలువలు కానీ లేవని నిర్ధారించారు. అంటే సంస్కృత, అరబ్బీ, ఉర్దూ భాషలలోని జ్ఞానాన్ని మర్చిపోవాలని శాసించారు. తద్వారా ఇంగ్లీషు, ఫ్రెంచిభాషలలోని విలువలే ప్రామాణికంగా సూత్రీకరించారు.

2. ఈ దేశప్రజలలో యుక్త వయస్సు వచ్చే లోపున ఆంగ్లభాష పండితులుగా తయారు చేయడం ద్వారా ఆంగ్ల సామ్రాజ్య స్థాపనకు ఉపయోగపడుతుందని, దీని ద్వారా సిసలు జ్ఞానం ఆంగ్లంలో వుందని, వారిని మాత్రమే ఉద్యోగాల్లో పెట్టుకోవాలని సూత్రీకరించడం జరిగింది. దీనివల్ల ఏం జరిగింది? స్థానిక భాషల నిర్లక్ష్యంతోపాటు ఆంగ్లంరాక భారతీయ విద్యార్థులు రెంటికి, చెడ్డరేవడులై 10శాతం మంది మాత్రమే కళాశాలలకు వెళ్ళడం జరిగింది. వీరిని మాత్రమే ఉద్యోగార్హులుగా తీర్మానించి పరిపాలన, పరిశ్రమలు, కార్యాలయాలు, స్కూళ్ళు, కాలేజీలు, బ్యాంకులు ఒకటేమిటి అన్ని రంగాల్లోను ఇంగ్లీషు వచ్చిన వారికి మాత్రమే ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది. దీనితో ఈ దేశయువత 3 వర్గాలుగా విభజింపబడి పోయారు. ఆంగ్లేయుల కొలువులో ఉన్నత వేతనంపై మంచి జీవన ప్రమాణంతో జీవించే మొదటి పౌరులు, వారందరికి సేవకులుగా వుండి స్కూలు వరకు మాత్రమే చదివిన రెండవ తరగతి పౌరులు ఈ ఆంగ్ల చదువు మీద శ్రద్ధ పెట్టని లోకవిద్యలో వున్న రైతులు, వృత్తి విద్యాధరులు, మరియు చిన్న వ్యాపారులు, కుటీర పరిశ్రమవారు. ఆఖరి మూడవ తరగతి పౌరులుగా గుర్తింపబడ్డారు. ఈ మొదటి తరగతిలో చేరే వాళ్ళు మొదట్లో కొద్దిమంది ఉన్నా, ఈనాడు తీవ్ర పోటీ వుండడంతో సాంఘిక భద్రత పేరుతోనో, కులంపేరుతోనో, మరొక పద్దతితోనో ఉద్యోగాలు సంపాదించాలనే తపన ఎక్కువగా వుంది. ఇక రెండో తరగతి వారికి పెద్ద ఉద్యోగాలు రాక చిన్న ఉద్యోగాల్లో చోటు దొరక్క పారంపర్య విద్యలో పనిచేయాల్సిన అవసరం కలుగుతుంది. కానీవారు ఈ నూతన అభివృద్ధి నమూనాలో స్థానంకోసం వెంపర్లాడుతూ ప్రస్తుత రాజకీయ పార్టీలకు, కులసంఘాల పేరుతోనో, మరోపేరుతోనో వూడిగం చేస్తుంటారు. ఇకమూడవ తరగతి పౌరులందరూ ఆంగ్లము ఏ మాత్రం రాని తమ జ్ఞానంతో తమకాళ్ళ మీద నిలబడాలనే ప్రయత్నించే లోకవిద్యాధరులు. వారికి ఎటువంటి ఆర్థిక భద్రత లేదు. వారికి తెలిసిన ఏదోఒక విద్యలో చిట్టచివరగా కూలీలుగా కూడా పనిచేస్తున్నారు. వారందరూ కూడా నేటి మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి పథకంలో కూలీలుగా మారిపోతున్నారు. ఇక్కడ వచ్చిన దురదృష్టకరమైన మార్పు ఏమిటంటే వారికి వచ్చిన వృత్తి విద్యలో గిట్టుబాటు ధరలు లభించక పార, పలుగు పట్టిన వారికి మాత్రమే ఉద్యోగమిచ్చే ఉపాధిపథకంలో చేరలేని వారు పెద్ద ఎత్తున ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. వీరందరిని అంటే గీతకార్మికులు, మత్స్యకార్మికులు, వడ్రంగులు, కమ్మరులు, కుమ్మరులు, చర్మకారులు, మేదరి వృత్తిచేసేవారు, చేనేత కార్మికులు, దర్జీలు, క్షురకులు, కంసాలులు, రజకులు, తాపీపనివారు, చిరువ్యాపారులు, తోపుడు బండ్లవారు మొదలైనవారందరిని జ్ఞాన హీనులుగా ముద్రవేసి ఇంగ్లీషు చదువులే జ్ఞానమని, ఆ జ్ఞానాన్ని మనం కోల్పోయామని కనీసం తరువాతి తరం వారికయినా ఆభాగ్యం కల్గించాలని చివరగా వెనుకబడిన వారమని, వారికి వారే నమ్మేస్థితికి తీసుకువచ్చారు. వీరిలో కొద్దిమంది చదివి ఉద్యోగాన్వేషణలో పట్టణాలకొచ్చినా ఇచ్చట వున్నటువంటి దారిద్ర్యం, నిరుద్యోగం, పోషకాహారలోపం, సరైయిన వైద్యం అందక, శుభ్రమైన త్రాగునీరందక చిట్టచివరగా అవినీతిలో కూరుకుపోయిన ఈ పట్టణీకరణలో నిస్సహాయిలుగా ఆత్మస్థైర్యం కోల్పోయిదీనంగా చూసే స్థితిలో వుండిపోతున్నారు. నేటి పెద్ద పరిశ్రమలు, ఐ.టి. కంపెనీలు అతికొద్దిమందికి అవకాశమిచ్చినా విశాల ప్రజానీకానికి ఉద్యోగాలు లేవు. దీనర్థం ఈ 150 సం॥ల మెకాలే ప్రభువులు స్థాపించిన విద్యావిధానం వెనకబడిన వారిని, విశాల ప్రజా బాహుళ్యాన్ని తయారుచేయడానికి మాత్రమేఉపకరించింది. ఎవరికి వారు వారి నైపుణ్యంతో ఉపాధి సంపాదించుకునే లోకవిద్యాధర సమాజాన్ని నిర్మించందే అటువంటి విద్యా వ్యవస్థరానిదే ఈ నిరుద్యోగ సమస్య తీరదు.

వ్యవసాయాధారిత, చిన్న నీటిపారుదల ఆధారిత, చేతి వృత్తుల వారి ఉత్పత్తుల వినియోగం కోసం స్థానిక మార్కెట్ ఆధారిత, పర్యావరణ రక్షిత, సామాజిక అవసరాల మేరకు ఉత్పత్తి నమూనాలో సమాజ పునర్‌నిర్మాణంలోనే మనందరి భవిష్యత్ ఉందనే విద్యావిధానం అమలుకావల్సిన అవసరముంది.

లోకవిద్యాధర సమాజమే వారికి కావల్సిన వృత్తి విద్యా నిపుణులను తయారు చేసే నూతన విద్యావిధానంను ప్రారంభించందే ప్రస్తుత మెకాలే ప్రభువుల చదువుల ద్వారా ఈ దేశ ప్రజలకు విముక్తి లేదు.

**ప్రొ॥ క్రిష్ణంరాజులు**

---

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం ప్రయివేట్ విద్యుత్ ప్రాజెక్టులకు విలువయిన పంట భూములు కేటాయించి, మౌలిక సౌకర్యాలు కల్పించి, సబ్సిడీ పై గ్యాస్ ఇస్తే విద్యుత్ ఉత్పత్తి చేసి అధిక ధరలకు బయట అమ్ముకుంటుంటే ఇంధన సర్‌చార్జీ పేరుతో వేలకోట్లు దోచిపెడ్తూ ప్రజలపై సర్‌చార్జీల పేరుతో ఇప్పటికే 18 సార్లు కాంగ్రెస్ ప్రభుత్వం ధరలు సవరించింది.

- రాష్ట్రంలో బొగ్గు ఉత్పత్తి, సరఫరాను నిర్వీర్యంచేసి విదేశాల్నుండి బొగ్గు దిగుమతి చేసుకునే పేరుమీద, నాసిరకం బొగ్గుకు అధిక ధరను చెల్లిస్తున్నారు.
- ఉత్పత్తవుతున్న విద్యుత్‌లో సరఫరా నష్టాలు 17 శాతం పెంచి చూపుతున్నారు.
- రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు కరెంటు కొరతతో ఇబ్బందులు పడుతున్నారు. రైతులకు 3 గంటలకు మించి సరఫరా ఉండడం లేదు. ఆంధ్ర ప్రాంతంకు తెలంగాణా ప్రాంతానికి విద్యుత్ కోతలో వివక్షత చూపిస్తున్నారు.

చిన్నతరహా పరిశ్రమలకు ప్రాధాన్యత రీత్యా పెద్ద పరిశ్రమలతో పోలిస్తే సబ్సిడీపై విద్యుత్ సరఫరా చేయాలి. కానీ విద్యుత్ కోత వలన చిన్నతరహా పరిశ్రమలు దివాలా తీసి లక్షలాది కార్మికులు ఉపాధి కోల్పోతున్నారు.. ఒకవైపు ఉపాధి కల్పన పేరుతో ప్రయివేట్ విద్యుత్ కంపెనీలకు వేలకోట్లు దోచిపెడుతున్న పాలకులు ఇంకొకవైపు చిన్నతరహా పరిశ్రమలకు కోతలు ఎలా విదిస్తారు? యూనిట్ విద్యుత్ రేట్లను పెంచడం ద్వారా కార్పోరేట్ కంపెనీలకు కనుకూలంగా ప్రభుత్వం వ్యవహరిస్తోంది. దీనిపై పాలకులు ప్రజాకోర్టులో సమాధానం చెప్పాలి. చదువుకునే విద్యార్థులకు విద్యుత్ సరఫరా లేక చదువు కుంటుపడుతోంది. పల్లెలలో వున్న ప్రజలకు విద్యుత్ ఎప్పుడు వస్తుందో తెలియని స్థితిలో వున్నారు. గ్యాస్ ఆధారిత విద్యుత్‌ను జెన్‌కో ఆధ్వర్యంలో శంకరపల్లి, నేదునూర్‌కు కేటాయిస్తే 3000 మె.వా. కొరతను అధిగమించి ఇతర రాష్ట్రాలకు విద్యుత్ సరఫరా చేయగల్గే స్థితిలో వుండేవాళ్ళం.

పాలకులు కృత్రిమ విద్యుత్ కొరతను సృష్టించి ప్రజల జీవితాలతో ఆటలాడుకుంటున్నారు. దేశంలో 1991 తర్వాత ప్రయివేటీకరణను అమలుచేసిన అన్ని పాలకవర్గాలు నేడు ఎన్నికల ముందు ఆందోళనకు దిగి ప్రజాఉద్యమం నిర్మిస్తామని చెప్తున్నారు.

సోంపేట దర్మల్‌కేంద్రం విషయంలో బీలభూములు, పర్యావరణ పరంగా విదేశీ పక్షుల వలస రావడం, రెండు పంటలు పండే భూముల్లో దర్మల్‌కేంద్రం ఏర్పాటుపై ఏ పార్టీకీ సంబంధం లేకుండా ప్రజలు వివిధ బృందాలుగా వృత్తిదారులు, మహిళలు, మేధావులు, గ్రామగ్రామం నుండి ప్రజలు సామూహిక శక్తిగా కదిలి మర్చంట్ పవర్‌ప్లాంట్‌ని రద్దు చేయించిన పోరాటం నుండి మనం స్ఫూర్తిని పొందాలి. ప్రభుత్వం, రెవిన్యూ, పోలీసు విభాగాలు కార్పోరేట్లకు అమ్ముడుపోయినా, వివిధ రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు నాగార్జున కంపెనీ జీతగాళ్ళుగా మారినా, పత్రికలు మీడియా లాప్‌టాప్‌లకు, డబ్బు సంచులకు అమ్ముడైనా ప్రజలు సామూహికంగా తిరగబడితే సాధించలేనిది లేదని సోంపేట ప్రజలు నిరూపించారు.

కావున ప్రయివేటీకరణకు అనుకూలురైన తెలుగుదేశం, వైఎస్ఆర్ కాంగ్రెస్‌లు, తమ విధానం మార్చుకోకుండా ప్రభుత్వ వ్యతిరేక పోరాటాలు చేసినా, చిత్తశుద్ధి వుండదు. వామపక్ష శక్తులు విధానంపరంగా మర్చంట్ పవర్ ప్లాంట్‌ను వ్యతిరేకించినా, తెలుగుదేశం, వైఎస్ఆర్ కాంగ్రెస్‌లను వత్తిడి చేసి విధానం పరమైన మార్పులను డిమాండ్ చేయడం లేదు. ఎన్నికల సందర్భంగా రాజకీయ ప్రయోజనాలకోసం పోరాడినా ప్రజలకు ఒరిగేదేమి వుండదు.

ఈ నేపథ్యంలో ప్రజలందరూ క్రింద డిమాండ్ల సాధనకు ఉద్య మించాల్సిన అవసరం వుంది.

1. కె.జి. బేసిన్‌లో రిలయన్స్, ఇతర కంపెనీల లైసెన్స్ రద్దుచేసి ప్రభుత్వ రంగంలోనే జి.ఎన్.జి.సి ద్వారా గ్యాస్‌ను వెలికితీయాలి.
2. రాష్ట్రంలోని ప్రయివేట్ గ్యాస్ ఆధారిత ప్రాజెక్టులు ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి. కె.జి. బేసిన్ నుండి వెలికితీసిన గ్యాస్‌లో మన అవసరాలు తీరిన తరువాతే ఇతర రాష్ట్రాలకు గ్యాస్‌ను సరఫరా చేయాలి.
3. ప్రజల భూములు, సబ్సిడీపై గ్యాస్, కేటాయించిన గ్యాస్ ఆధారిత విద్యుత్ ప్రాజెక్టులకు రూ. 2.80లకు మించి యూనిట్‌కు అధికంగా చెల్లించిన కోట్ల రూపాయలను ఆ కంపెనీల నుండి రికవరీ చేయాలి.

   చట్టవిరుద్ధంగా అధికధరను చెల్లించిన నాయకులను అరెస్ట్‌చేసి కఠినంగా శిక్షించాలి.
4. గ్రామాలకు, పల్లెలకు, ఒకేవిధమైన విద్యుత్ కోత కాలాన్ని అమలు చేయాలి. వివక్ష కూడదు.
5. రాష్ట్రంలో బొగ్గు తవ్వకం ప్రయివేట్ రంగంలో చేయరాదు. ప్రయివేట్ కంపెనీలకు ఇచ్చిన బొగ్గు బావులు రద్దు చేయాలి.
6. పంపిణీ నష్టాలను తగ్గించే చర్యలు తీసుకోవాలి.
7. సోలార్, పవన, బయోమాస్ విద్యుత్‌కు తక్కువ ధరలతో ఉత్పత్తి చేసేందుకు పరిశోధన, అభివృద్ధికి ఇంజనీరింగ్ కాలేజీలను ప్రోత్సహించి భాగస్వాములను చేయాలి. వీటి ఉత్పత్తికి తోడ్పడే పరికరాలను అతిచౌకగా అందర్కీ అందుబాటులోకి తేవాలి.
8. అణువిద్యుత్ కేంద్రాలు తక్షణం నిలిపివేసి నిర్బంధగా స్వాధీనం చేసుకున్న పంటభూములను ప్రజలకు అప్పగించాలి.

**- కె.జె. రామారావు**

# పట్టణ వ్యర్థపదార్థాలను పల్లెల మీదకు విసిరే అమానవీయ పద్ధతులకు వ్యతిరేకంగా ఉద్యమించిన గ్రామీణ లోకవిద్యాధర సమాజం

ప్రస్తుత అభివృద్ధి నమూనాలో అందమైన ప్యాకింగులలో ఇంటికి తీసుకెళ్ళి తరువాత విసిరేసే ప్యాకింగ్ వస్తువులతో సహా, పట్టణాలలో ఉత్పత్తయ్యే కోట్ల టన్నుల వ్యర్థ పదార్థాలను జాగ్రత్తగా విభజించి, తిరిగి వాడే ఖరీదైన పద్ధతి బదులు పట్టణాల చుట్టుపక్కల వున్న గ్రామాలపై చెత్తా చెదారం వేసే మున్సిపల్ సంస్కృతి భారతదేశంలో అప్రతిహతంగా కొనసాగుతోంది. పట్టణ ప్రజలకు అతి చౌకగా మంచినీరు, రవాణా, రోడ్లు, వీధిదీపాలు, మొదలైన సౌకర్యాలను అనుభవిస్తూ, వారు వదిలే వ్యర్థాల సమస్యవారే పరిష్కరించుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది. ఈ వ్యర్థాలను పట్టణ ప్రాంతాల దగ్గరలోని గ్రామాల పొలిమేరల్లో విసిరేయడం వల్ల గ్రామీణ ప్రాంతంలోని గాలిదుర్గంధంతో, ఈ వ్యర్థాలలోనుంచి ఊరిన మురికిద్రవం త్రాగే నీళ్ళలో, క్రిమికీటకాలను చేరుస్తుంది. మంచి పంటపొలాలు విషపూరితంగా మారుతున్నాయి. దీనికి వ్యతిరేకంగా స్థానికంగా హైద్రాబాద్, బెంగుళూర్, తిరువనంతపురం, చెన్నైల నుంచి వారణాసి దాకా, గ్రామీణ ప్రాంత ప్రజలు ఉద్యమాల ద్వారా కొంత మేరకు సఫలీకృతం అయ్యారు.

పర్యావరణ న్యాయచట్టం అమల్లో కొచ్చింది. దీనిప్రకారం పట్టణ ప్రాంతాల్లోనే వ్యర్థాలను శుద్ధిచేసి పునర్‌నిర్మాణ లేదా పునరుత్పత్తి కార్యక్రమాలకు ఉపయోగించాలని, పదార్థాలను విసర్జించే వారికి శుభ్రమైన గాలి, నీరు, వాతావరణం మీద ఎంత హక్కుందో ఇతర ప్రాంతాల వారికి కూడా అంతే హక్కుందని, వారి జీవితాలతో ఆటలాడవద్దని, వ్యర్థపదార్థాలను విసర్జించే స్థల సేకరణ, దీన్ని శుద్ధి చేయడానికి కావల్సిన ఏర్పాట్లు పర్యవేక్షించడానికి కాలుష్య నివారణ లేదా నియంత్రణ మండలిని నియమించడం జరిగింది.

దీనికి విరుద్ధంగా అనకాపల్లి మున్సిపాలిటీ వారు వారి వ్యర్థ పదార్థాలను సుందరయ్య పేట, అచ్చయ్యపేట, వెంకుపాలెం, సంపతిపాలెం, కొండ్రాం, కంచంగి, వేటజంగాలపాలెం, రొంగులవానిపాలెం, బి.ఆర్.పి. కాలని, దళిత బహుజనకాలని, కృష్ణాపురం, ప్రాంతాలలో వేయడాన్ని ఆ గ్రామప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారు. మున్సిపాలిటి వారి లారీలను ప్రజలు సంఘటితంగా అడ్డుకోవడంతో, విశాఖజిల్లాలోని పోలీసులను మోహరించి, అనకాపల్లి మున్సిపల్ కమీషనర్, డి.ఎస్.పి., ఆర్.డి.వో, ఎం.ఆర్.వోలు చట్టవిరుద్ధంగా ప్రజాఉద్యమాన్ని అణగదొక్కడానికి లాఠీచార్జీ జరిపించి స్త్రీలతో సహ నాయకుల్ని జైళ్ళలో కుక్కడాన్ని వ్యతిరేకిస్తూ జాతీయ ఉద్యమాల ప్రజాస్వామ్య సంఘటన, లోకవిద్యాజనాందోళన, పౌరహక్కులు వేదిక, మానవ హక్కుల వేదిక తదితర సంఘాలు సమావేశమై హైద్రాబాద్‌లో పత్రికా విలేఖరుల సమావేశంలో 23 మార్చి 2013న ప్రభుత్వ నిర్బంధ చర్యలను ఖండిస్తూ, అరెస్ట్ చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని కోరడం జరిగింది.

**హైదరాబాద్ ప్రతినిధి**

# లోకవిద్యలో వైద్యం

'భారతీయ సాంప్రదాయ వైద్యవిధానాలు ఎంతో ప్రచుర్యాన్ని సంపాదించుకున్నాయి.'

మన ప్రాచీన వైద్యులయిన చరకుడు, శశ్రుతుడు మొ॥లైన ప్రాచీన వైద్యులు చరక్ సంహితలాంటి వైద్య గ్రంథాల ద్వారా వైద్యాన్ని మనకు వారసత్వ సంపదగా అందించారు. మన పూర్వీకులు తమకు అందుబాటులో ఉన్న మొక్కలను, చెట్లను ఉపయోగించుకుని తమ ఆరోగ్యాలను కాపాడుకున్నారు. క్రమక్రమంగా ఆధునిక వైద్య విధానాలు అందుబాటులోకి వచ్చిన తర్వాత ఈ సాంప్రదాయ వైద్యం కనుమరుగయి పోయింది. అయితే నూతన వైద్యాన్ని వైద్య విధానాలను పూర్తిగా వ్యతిరేకించలేం కాని, ప్రతిచిన్న ఆరోగ్య సమస్యలకు అల్లోపతి వైద్యమే పరిష్కారంగా భావించి ప్రజలు మరింత అనారోగ్యాల పాలవుతున్నారు. 'ప్రాచీన' వైద్యాన్ని నిర్లక్ష్యం చేసి ఆధునిక వైద్యానికి పట్టం కట్టడం మంటే మన ఆరోగ్యాన్ని మనమే చేతులారా హాని కలిగించిన వారమవుతాము. ప్రస్తుతం ఉన్న ఈ కలుషిత వాతావరణంలో మనకు ప్రకృతి ప్రసాదించిన చెట్లు, మొక్కలను ఔషధాలుగావాడి ఆరోగ్యాన్ని కాపాడుకోవలసిన అవసరం ఏర్పడింది. అన్ని ఆరోగ్య సమస్యలకు అల్లోపతి వైద్యమే పరిష్కారం కాదని భావించిన ప్రజలు ఇప్పుడిప్పుడే ప్రత్యామ్నాయ విధానాల పట్ల మక్కువ చూపుతున్నారు. అందులో భాగంగానే ఆయుర్వేదం, హోమియో మొదలైన వైద్య విధానాలు మనకు వచ్చే అనేక ఆరోగ్య సమస్యలకు ఇంట్లో ఉండే సరంజామలోనే వైద్యం చేసుకోవచ్చు. అందులో కొన్ని పద్ధతులు :

మన గురించి బయటవాళ్ళు చెబితే తప్ప తెలియని దుస్థితిలో ఉన్నాం. అమెరికన్ పత్రిక 'క్లినికల్ న్యూట్రిషన్' తాజా అధ్యయనం బార్లీ గింజల ప్రాముఖ్యాన్ని తెలియచేసింది.

ప్రతిరోజు, ఒకగ్లాసు బార్లీ నీళ్ళుతాగితే మూత్రనాళం జబ్బులు, శరీరంలో కొవ్వుతగ్గడం, అధిక రక్తపోటును నివారిస్తుంది. బార్లీ గింజలను పొడిచేసి 2, 3 గరిటెలు నీళ్ళలో వేసి ఉడికించి గ్లాసు మజ్జిగలో ఉప్పువేసి కలుపుకొని త్రాగితే వడదెబ్బనుండి ఉపశమనం లభిస్తుంది.

లండన్‌లో దిబార్ట్ మెడికల్ స్కూల్ ప్రొఫెసర్ 'అమృత ఆహ్లూవాలియా' బీట్‌రూట్‌పై పరిశోధన చేసి బీట్‌రూట్ రసాన్ని ఉదయం, సాయంత్రం ఒక గ్లాసు చొప్పున తీసుకుంటే అధిక రక్తపోటు అదుపులో ఉంటుందని పేర్కొన్నారు.

ఇంకా దేశంలో గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు పాటించే అనేక పద్ధతులు తక్కువ ఖర్చుతో మేలు కల్గేవి వున్నాయి.

1 రాగిపిండిని జావలా కాచుకుని మజ్జిగలో గాని, పాలలో గాని కలుపుకొని తాగటం వలన శరీరానికి శక్తి లభిస్తుంది.

2. 200 గ్రా॥ కొబ్బరి బోండాం నీటిలో 46 కాలరీల శక్తి లభిస్తుంది.

3. అదే కోక్, మజా వంటి శీత పానీయాలు వలన అధిక కాలరీలు శరీరంలో చేరి అనారోగ్యానికి దారి తీస్తుంది.

4. అన్నం గంజిలో మజ్జిగ కలిపి దబ్బఆకు వేసి ఒక గ్లాసు త్రాగితే ఎండవేడినుండి కాపాడుతుంది.

వార్చినగంజిని కుండలో పోసి, కాసిని నీళ్ళు కలిపి మర్నాటి ఉదయం తేటలో కాస్త ఉప్పేసుకుని తాగటం నిన్నటితరంలో చూశాం. దాని తేటకు మరింత కొత్త గంజి కలపటం, దానిలో మిగిలిన అన్నాన్ని వేసి మర్నాడు ఎండవేళ కొత్తావకాయతో తినటం స్కూలు పిల్లలల దినచర్యగా 30-40 ఏళ్లక్రితం గ్రామీణ ప్రాంతంలో అలవాటే. పై తేటలో మజ్జిగతో ఎండవేళ తాగి ముసలాళ్ళు 2-3 గం॥ నిశ్చింతంగా నిద్రపోవడం కరెంటు లేని రోజుల్లో 50 సం॥ క్రితం గ్రామీణ ప్రాంతంలో మామూలే.

5. గ్రామీణ ప్రాంతాలలో నివసించే తాటిచెట్లు, ఈతచెట్ల నుండి తీసే తాజా కల్లు (నీరా) తాగితే ఎండదెబ్బనుండివెంటనే కోలుకుంటారు.

6. అజీర్తితో బాధపడేవారు జీలకర్రను వేయించి పొడిగా చేసి గ్లాసుడు నీళ్ళలో కలిపి త్రాగితే వెంటనే ఫలితం ఉంటుంది.

7. కీరకాయ, జీలకర్ర పొడి, కొత్తిమీర కలిపి తింటే తిన్నది త్వరగా జీర్ణమై మలబద్ధకం తగ్గుతుంది. ఇంకా కీరకాయలో ఎ, బి, సి విటమిన్లు ఉంటాయి. పొటాషియం, మెగ్నీషియం, సిలికాన్లు ఉంటాయి. అది రక్తపోటుకు, అజీర్ణంకు బాగా పనిచేస్తుంది.

8. అలోవేరా (కలబంద) రోజూ పరిమిత మోతాదులో తీసుకుంటే మధుమేహం, అధికరక్త పోటు నుండి కాపడుకోవచ్చు. అలాగే గాయాలు, పుండ్లు, త్వరగా మానడం, చర్మవ్యాధులను తగ్గిస్తుంది.

9. పనసపండు సీజన్‌లో రోజూ సేవిస్తే 'లోబి.పి''ని నివారిస్తుంది. కడుపులో పుళ్ళు, అజీర్ణం సమస్యలకు చర్మవ్యాధులను, ఆస్తమా తగ్గిస్తుంది. నరాల ఉద్రిక్తత, వత్తిడి ఉన్నవారికి పనసపండు దివ్యఔషధం.

10. అలాగే పుదీనా రసం ఎండాకాలంలో ఒకగ్లాసు సేవిస్తే వడదెబ్బ తగలదు.

11. రాగులు, జొన్నలు, సజ్జలు కొర్రలు కలిపి పిండి చేసి జావలా చేసి ఉడికించి పాలలో లేదా మజ్జిగతో సేవిస్తే అధిక ప్రొటీన్స్ లభిస్తాయి.

అంతేకాకుండా ఆయా కాలాలలో లభించే అనేక రకాల పండ్లను అలాగే తినటంగాని, వాటిని జ్యూస్‌లా చేసుకొని గాని సేవిస్తే శరీరానికి ఎంతో మంచిది.

ఈ విధంగా మన పూర్వీకులు చెప్పిన అనేక చిట్కాలను గాలికి వదిలేసి కార్పోరేట్ వైద్యశాలలకు పరుగులు తీస్తున్నాం.

కూల్‌డ్రింక్స్, ఐస్‌క్రీమ్స్, చాక్‌లెట్లు, పీజాలు, బర్గర్‌లాంటి జంక్ ఫుడ్స్ తీసుకుంటూ యువత తమ ఆరోగ్యాన్ని తామే చేజేతులా నాశనం చేసుకుంటున్నారు.

కాబట్టి ఈ ఆధునిక జీవన విధానంలో వెర్రిగా పాశ్చాత్య ప్రభావానికి లోను గాకుండా మన సాంప్రదాయ వైద్య పద్ధతులను పాటిస్తే మన ఆరోగ్యాలను కాపాడుకున్న వారమవుతాము.

**పి. రాజ్యలక్ష్మి**

# జయప్రదంగా జరిగిన సోంపేట భూతల్లి పండుగ

జాతీయ ప్రజాఉద్యమాల ఐక్య వేదిక ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో మార్చి 8 నుండి 10వ తేదీ వరకు సోంపేట భూతల్లి పండగ జరిగింది. 3 రోజులలో 400 మంది ప్రజలు ఈ ఉత్సవంలో పాల్గొన్నారు.

8-3-2013న వ్యవసాయం - విత్తనాల పై డక్కన్ డెవలప్ సొసైటీ ఆధ్వర్యంలో పి.వి సతీష్ మాట్లాడుతూ జహీరాబాద్‌లో స్త్రీలు పాటలద్వారా ఏ విత్తనాలు ఏ కాలంలో పెట్టాలి రోహిణిలో కొర్రలు, ఆరుద్రలో రాగులు, జొన్నలు ఇలా ఏ కాలంలో ఏవిత్తనం వెయ్యాలో పాటలో ద్వారా వ్యవసాయ విజ్ఞానం తెలియ చేస్తారని పేర్కొన్నారు.

ధర్మల్‌ప్లాంట్‌కు వ్యతిరేకంగా ఇక్కడి ప్రజల పోరాటంతో నేను ప్రభావితం అయ్యాను అన్నారు. వెనిజులా అనే చిన్న దేశం ప్రపంచ బ్యాంక్ వద్దు అని సాహసంతో చెప్పాడు. ఇవాళ కావల్సింది సగటు ఆరోగ్య సూచిక. ప్రపంచంలో ఏదేశంలో ఇలా ఆరోగ్యంగా వున్నారో తెలుసా! భూటాన్. ఇక్కడి ప్రజలు ఆరోగ్యంగా వున్నారు.

అమెరికా గ్లోబల్‌గా పెట్రోల్ వనరులను కంట్రోల్ చేస్తూ ప్రపంచాన్ని శాసిస్తోంది. వ్యవసాయరంగంలో మోనోసాంటో, డ్యూపాంట్, కార్గిల్ పెద్ద కార్పోరేషన్లు వ్యవసాయ రంగంలో విత్తనాలను నియంత్రిస్తోంది. జన్యుమార్పిడి విత్తనాల ప్రవేశాన్ని పార్లమెంటులో 35 మంది పార్లమెంటు సభ్యులు వ్యతిరేకించారు.

నేడు ఆహార సార్వభౌమత్యం అన్ని రకాల ఉద్యమాల లక్ష్యం కావాలి. ఈనాడు కమ్యునిటీ ఆహార సార్వబౌమత్యం కావాలి. ప్రతీ ఇంట్లో కావాల్సిన ఆహారం, విత్తనాలు నిల్వ ఉండాలి. మెదక్ జిల్లా జహీరాబాద్‌లో మేం రాగి, జొన్న, కొర్రలు, చిరుధాన్యాల ఉత్పత్తి పెంచాం. ఎరువులు, మందులు వుపయోగించడంలేదు. విత్తనాలు నిల్వ చేస్తున్నారు. నీకు కావాల్సిన ఆహారాన్ని అందుబాటులో లేకపోతే నిన్ను అణిచేస్తారు, జహిరాబాద్‌లో దళిత మహిళలు విత్తనాలు నిల్వచేసుకోవడం, వర్షాదారం పై ఆధారపడి చిరుధాన్యాలు పండిస్తూ బహుళ రకాల పంటల ద్వారా భూసారంను పరిరక్షిస్తున్నారు. ఏ మట్టిలో ఏ పంటవేయాలి? ఈ జ్ఞానం అంతా స్త్రీలు శిక్షణ ద్వారా తెలియజేస్తున్నారు. మా సొసైటీ ద్వారా చిరుధాన్యాలు అమ్ముతూ ఆహార సార్వభౌమత్యాన్ని మేం సాధించి చూపాం. అన్నారు. మేం పండించిన ఉత్పత్తులు, చిరుధాన్యాలు, విత్తనాలు సభ ఆవరణలో షాపులో ప్రదర్శనకు పెట్టాం అని వివరించారు.

చంద్రమ్మ, కమలమ్మ, నర్సమ్మలు విత్తనం బ్యాంక్ ఏర్పరచడం పేద వారందరి భూములను సర్వేచేసి, చదునుచేసి పొలంలో మట్టిని బట్టి ఏ మట్టిలో ఏ విత్తనం పండుతుందో ఎన్నిక చేసి అనేక రకాల వైవిద్యమైన పంటలను పండిస్తూ, దక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ సహకారంతో జయప్రదంగా మార్కెటింగ్ చేస్తూ లాభదాయకంగా వ్యవసాయం చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని వర్షాదార భూములలో అనేక జిల్లాలలో చిరుధాన్యాలు పండించేందుకు రైతులకు సహకారం అందిస్తునామని తెలియచేసారు. గ్రామంలో పేదరైతులను గుర్తించి ఒక్క కుటుంబానికి చిరుధాన్యాలు కిలో రూ॥కి 20 కిలోలు జొన్నలు అందిస్తున్నామని తెలియజేశారు. తెల్లజొన్న, పచ్చజొన్న, ఎర్రజోన్న, పెసర్లు, మినుములు, శనగ, కొర్రలు దాదాపు 70 గ్రామాలలో చిరుధాన్యాలు పండిస్తున్నామని తెలియచేసారు.

లోకవిద్య జనాందోళన నాయకులు ప్రొఫెసర్ క్రిష్ణంరాజు మాట్లాడుతూ లోకవిద్య అంటే. వ్యవసాయం చేసే స్త్రీలలో వుంది. ఏ విత్తనం ఏ మట్టిలో వేయాలి. ఏ ఏ పంటలు వేయడం ద్వారా భూమిసారం పెంచాలి అనేదే లోకవిద్య చదువుకున్న వారు పల్లెలు వదిలి పట్నాలకు వెళ్ళిపోయి ప్రజలను పట్టించుకోవడం లేదు. ఈ పరిస్థితులలో లోకవిద్య. అనేక సం॥లుగా వారసత్వంగా వస్తున్నదాన్ని జహిరాబాద్ ప్రాంతంలో మహిళలు తమ విద్య ద్వారా ఆహార సార్వభౌమత్వం సాధించారని అన్నారు. కుండలు చేయడంలో, బట్టనేయడంలో, ఒకమాటలో ఉత్పత్తి విధానంలోనే విద్య పారంపర్యంగా వుందని, ఆధునికత ఈ విద్యలను ధ్వంసం చేసి మన బతుకు దుర్భరం చేస్తోందని, మనకున్న సాంప్రదాయ విద్య మాత్రమే ఉపాధి కల్పిస్తుందని, సాంప్రదాయ విద్య, ఉత్పత్తి, గ్రామీణ మార్కెట్ల పునరుద్ధరణ ద్వారానే నిజమైన అభివృద్ధి సాధ్యం అన్నారు. ఆధునిక విద్య మనిషిని పరాయికరిస్తుంది. సమాజం నుండి దూరం చేస్తుంది. పెట్టుబడిదారి విధానంను నిరంతరం అభివృద్ధి చేసి సాంప్రదాయ విద్యను నాశనం చేస్తుందని అన్నారు. ఇది మన దగ్గరేకాదు. లాటిన్ అమెరికా, చైనా దేశాలలో కూడా విద్య విధానం నష్టంచేసింది. ప్రజలు బిచ్చగాళ్ళుగా, తక్కువ జీతాలతో ఎక్కువ గంటలు పనిచేస్తున్నారు.

సోంపేటలో నాగార్జున కంపెనీ భూమి సేకరించడం వలన మత్సకారులు, రైతులు దెబ్బతిన్నారు. మీరు వ్యవసాయం చేయకుంటే, చేపలు పట్టకపోతే ఏం అవుతుంది? కూలీలుగా మారతారు. మీరు గ్రామాలను వదిలి మీ వృత్తులను విడిచిపెడితే మీరు కూలీలుగా తప్ప ఎందుకు పనికిరారు. అందరూ కూలీలుగా వుండే బతుకుదామా? గ్రామీణ ప్రాంతాలలో మనం పాలకులుగా మారకుండా మన కాళ్ళపై, మన విద్యపై నిలబడినప్పుడే మన అభివృద్ధి సాధ్యమౌతుందని అన్నారు.

లోకవిద్య ప్రపంచం ఎడిటర్ నారాయణరావు మాట్లాడుతూ భారీ నీటి ప్రాజెక్టులు, విద్యుత్ ప్రాజెక్టులు వల్ల పెద్ద రైతులు బాగుపడ్డారని, నిర్వాసితులు, కాల్వకింది రైతులకు నీరందకపోవడం, విత్తనాలు నిల్వచేసుకోకుండా మార్కెట్ దయాదాక్షిణ్యాలపై ఆధారపడుతున్నామని మెదక్ జిల్లాలో దక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ వారి కృషి సాంప్రదాయ విద్యను రక్షించి, కమ్యూనిటీ సార్వభౌమత్యం కోసం చేసిన కృషిని మనం ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఏక పంట విధానంతో పాటు పురుగులమందులు విపరీతంగా వాడటంతో పశ్చిమ ఉత్తర ప్రదేశ్, పంజాబ్ హర్యానా రాష్ట్ర పొలాలు చౌడుబారి పనికిరాకుండా పోవడంతో దీని మరమ్మత్తుకై కేంద్రం ఐదు వేల కోట్ల రూపాయల ప్రత్యేక ప్యాకేజీ ఈ సంవత్సర బడ్జట్‌లో పెట్టాల్సిన దుస్థితి నుంచి తప్పించుకోవాలంటే అంతర్ పంటలు, స్వంత విత్తనాలు స్థానిక సేంద్రీయ ఎరువులు వాడాలని డిడిఎస్‌వారు చెప్పిన విషయాన్ని ప్రముఖంగా ప్రచురిస్తామని హామీ ఇచ్చారు.

కలకత్తా, ఒరిస్సా నుండి వచ్చిన కార్యకర్తలు సాంస్కృతిక ప్రదర్శన ద్వార గిరిజన ప్రాంతాలలో పెట్టుబడిదారీ శక్తుల ప్రవేశం వలన గిరిజనుల జీవితాలు ఎలా అణచివేయబడుతున్నాయో నృత్య రూపకంగా ప్రదర్శించారు. సమావేశం హాలులో ఇతర రాష్ట్రాల నుండి, ఆంధ్రప్రదేశ్ నుండి గిరిజనుల సాంప్రదాయ వృత్తులు, విత్తనాలు, సోలార్ విద్యుత్, లోకవిద్య ప్రపంచం పత్రిక స్టాల్స్‌ను ప్రజలు సందర్శించారు. డక్కన్‌డెవలప్‌మెంట్ సొసైటీవారి చిరుధాన్యాల వంటకాలు భుజించి అందరూ అభినందించారు. భూతల్లి పండగకు గ్రామాలనుండి అనుకున్నంతగా ప్రజలు హాజరు కాలేదు.

**- సోంపేట ప్రతినిధి**

# ఒడిస్సా నియమగిరి కొండల్లో వేదాంత మైనింగ్ గ్రామసభ అంగీకారం లేకుండా చేయకూడదని సుప్రీంకోర్టు తీర్పుకు జేజేలు

ఏప్రిల్ 18, 2013న ఒడిస్సా రాష్ట్రంలోని నియామగిరి కొండల్లో వేదాంత గ్రూపు మైనింగ్ గ్రామసభ అంగీకారం లేకుండా ఎటువంటి తవ్వకాలు చేయరాదని కమ్యూనిటీ గ్రామ సభల హక్కులు ఉల్లంఘించడానికి వీల్లేదని సుప్రీంకోర్టు తీర్పు దేశంలో అక్రమ మైనింగ్ చేసే విదేశీ, స్వదేశీ దొంగలకు చెంపపెట్టు. వనరుల వినియోగం, వెలికితీత పై గ్రామ సభలకు సర్వాధికారాలు వున్నాయని, అంతిమ నిర్ణయం గ్రామ సభలచే అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

దేశవ్యాప్తంగా బహుళజాతి కంపెనీలు అక్రమ మైనింగ్ పై సుప్రీంకోర్టు తీర్పుకు మద్దతుగా ప్రజలు ఉద్యమించాలని, గ్రామసభల తీర్మానం లేకుండా అరకులోయలో రస్‌అల్‌కైమా, జిందాల కంపెనీల ఒప్పందాలు రద్దు చెయ్యాలని 'లోకవిద్య జనాందోళన' ప్రజలకు పిలుపిస్తోంది.

**విద్య అంటే సమాజంలో అసమానతలను తొలగించేది.**

Printed, Edited & Published by T. Narayana Rao B.Com., LL.B. D.No. 10-100, New Gaddiannaram, Behind Shivaganga Theaters, Saroornagar (M), R.R. Dist. A.P.- 60
Printed at : M/s Print Point, H.No. 5-14, Opp. Megha Theatre lane, Durganagar, Dilsukhnagar, R.R. Dist. A.P.-500 060.

## ہندوتان کی عوام اور اسکی گربت – حصہ ۸

پچھلے لکھ میں یہ کہا گیا تھا کی عوام کی خوشحالی کی ترکیبیں بنانے کے بدلے یہ سیاستدان عوام میں صرف آپسی فوٹ ڈالنے کی ترکیبیں بناتے رہتے ہیں؛ سَماجی میل جول میں مذہب کے نام پر ایک دوسرے کو ڈرا دھمکا کر رکھنے کی ہر کوشش کرتے ہیں؛ یہ لوگوں کی سوچ میں ایسا اندیشہ (شبہ) پیدا کرنے کی کوششوں میں لگے رہتے ہیں کہ مانو جیسے ایک مذہب میں اِیمان رکھنے والے کسی دوسرے مذہب میں اعتماد رکھنے والوں کا گلا کاٹنے کے لئے ہر پل مہکے کی تلاش میں بیٹھے ہوں. ہندوستان میں کیی سیاسی جماتیں ہیں، قومی اور علاقائی؛ سبکا اپنا اپنا ایک ووٹ بینک ہے. انمے سے جس سیاسی جماعت کو لگاتار فرقپرست کرار دیا جا رہا ہے انکا ووٹ بینک کریبن ۳۰ فیصد ہے؛ اگر یہ مان لیا جائے کی ہند کی ۳۰ فیصد آبادی فرقپرست ہے تو ہند سماج کا کیا حصر ہوا ہوتا یہ سوچ ہی بہت ڈراونی لگتی ہے. اگر کسی بھی مذہب کا دہشت گردی سے کوئی نسبت نہیں تو پھر ایک سیاسی جماعت فرقپرست نہیں ہو سکتی کیونکہ اسسے ہر مذہب کے لوگ جڑے ہوتے ہیں. ایسی ہی اور دیگر سیاسی جماتیں ہیں جنہیں وقت وقت پے فرقپرست کرار دیا جاتا ہے.

ایسے ہی غیر مناسب مدھوں کو لیکر عوام کا دھیان مناسب مدھوں سے ہٹا دیا جاتا ہے اور سیاسی مذاکرہ اور فیصلے عوام کی ضرورتوں کو پورا کرنے کے نظریے سے نہیں ہوتے، بلکہ ایک خیالی فرقپرستی تاکتوں کو ستا سے دور رکھنے کے نظریے سے لئے جاتے ہیں. بدعنوانی جو دیش کو اندر سے کھوکھلا کر رہی ہے اسسے نپٹنا نہیں چاہتے (کیونکہ سب سیسے جماعتوں کے ہاتھ اسسے رنگے ہیں ) لیکن عوام سے کہتیں ہیں کہ فرقپرست تاکتوں کے ساتھ ملکر بدعنوانی سے نہیں نپٹگیں. اگر صَداقَت یہ ہے کی کچھ سیاسی جماتیں فرقپرست ہیں تو چناو ایوگ انکے چُناو لَڑنے پر روک کیوں نہیں لگاتا؟ ہند کی سنسد میں فرقپرست جمیت کیسے حاضری دے سکتے ہیں؟ یہی بے ایمانی ہے سیاستدانو کی.

**మీకు తెలుసా!**

60 ఎమ్.ఎల్. దగ్గుమందు సీసా తయారీ ఖరీదు 4-5 రూపాయలు. అయితే అమ్మకం రూ. 40-50, 500 ఎమ్.ఎల్. సెలైన్ సీసా తయారీ ఖరీదు 4-5 రూ॥. అమ్మకం రూ. 70-80 అని మీకు తెలుసా!

- తటవర్తి నారాయణరావు



సోంపేట భూతల్లి పండుగ సభలో మాట్లాడుతున్న లోకవిద్య ప్రపంచం ఎడిటర్ నారాయణరావు

జ్ఞానం లాభాపేక్ష కోసం పరిశ్రమ కారాదు

జ్ఞానం సమాజంలోనుంచే ఉద్భవిస్తుంది.

అన్ని రకాల విద్యలు, వృత్తులు సమానమే

జ్ఞానం మానవుడు సంపూర్ణ మానవుడవటానికి దోహదపడాలి.

మా సంస్థ గురించి మరియు పాత పత్రికల గురించి చూడవల్సిన
వెబ్ పేజీ : Loka Vidya blogspot vidyaashram
**http : // www.vidyaashram.org/lokavidya_prapancham.html.**
**http : // vidyaashram.org/papers/LJA-Announcement_Telugu.pdf**

**"లోకవిద్య ప్రపంచం" చదవండి, చదివించండి,**
**చందాదారులగా చేరండి. సంవత్సర చందా రూ. 50/-**

దీనిలోని వ్యాసాలు యథాతథంగా ఎవరైనా, ఎక్కడైనా ప్రచురించటానికి హక్కులు అందరివి.

వ్యాసాలు, ఉద్యమ వార్తలు పంపించవలసిన చిరునామా :
**Loka Vidya Prapancham**
**D.No. 10-100, New Gaddiannaram, Behind Shivaganga Theaters,**
**Saroornagar (M), R.R. Dist. A.P.- 500 060 Ph : 040-24152155**
**e-mail : tnrkoundinyasa@yahoo.com**

**BOOK - POST PRINTED MATTER**
**APRIL - 2013**

**To**

**Printed, Edited & Published by T. Narayana Rao B.Com., LL.B. D.No. 10-100, New Gaddiannaram, Behind Shivaganga Theaters, Saroornagar (M), R.R. Dist. A.P.- 60**
**Printed at : M/s Print Point, H.No. 5-14, Opp. Megha Theatre lane, Durganagar, Dilsukhnagar, R.R. Dist. A.P.-500 060.**